పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయ పడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- **ఆయన అనుచరులపైనా కేసు**
- **రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్**
- **ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం**
- **విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ

- **బాలవాటిక పేరుతో తరగతులు**
- **అధికారులను ఆదేశించిన సీఎం**
- **ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన**
- **అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

● ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూస్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్ల దాడి

- **రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ**
- **అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత**

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.

గాయపడ్డ రైతు

డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

- **తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరు వానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

ఆర్సీవో కార్యాలయాన్ని తరలించొద్దు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆర్సీవో కార్యాలయాన్ని ములుగు జిల్లాకు తరలించే కుట్రలు మానుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసునాయక్ అన్నారు. మంగళవారం ఆర్సీవో కార్యాలయం ఎదుట ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువగా 16 గురుకుల పాఠశాలలు ఉన్నాయని, పార్లమెంట్ కేంద్రంలోనే ఆర్సీవో ఆఫీస్‌ను ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

డోర్నకల్, సెప్టెంబర్ 24 : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి సద్విజ అన్నారు. మంగళవారం డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని రాజు తండా కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల, హాస్టల్ పరిసరాల్లో శానిటేషన్ చేయాలని సూచించారు. విద్యార్థులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్ బియ్యం లోడును (టాటా ఏసీ)అడ్డుకుంటున్న గ్రామస్తులు

పీడీఎస్ బియ్యం తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

గంగారం, సెప్టెంబర్ 24 : ఏజెన్సీ ప్రాంతంలో రాత్రి సమయాల్లో పీడీఎస్ బియ్యం దందా జోరుగా సాగుతున్నది. మండలంలోని మడగూడ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి కొందరు స్మగ్లర్లు ఓ వాహనంలో 12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొన్నారు. దీంతో అక్రమార్కులు బియ్యాన్ని అక్కడే వదిలి పరారయ్యారని గ్రామస్తులు తెలిపారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

దంతాలపల్లి, సెప్టెంబర్ 24 : పరిసరాల శుభ్రతతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంజేపీ, ఎస్టీ హాస్టళ్లను ఆయన సందర్శించారు. విద్యార్థుల గదులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. డాక్టర్ చైతన్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందిర మహిళా క్యాంటీన్‌కు స్థల పరిశీలన

డోర్నకల్, సెప్టెంబర్ 24 : డోర్నకల్ పట్టణంలో ఇందిర మహిళా క్యాంటీన్ ఏర్పాటుకు డీఆర్‌డీవో మధుసూదన్ రాజు మంగళవారం పాత పోలీస్‌స్టేషన్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 30న ఇందిర మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శంకర్‌నాయక్, సీసీలు రాధ, స్వర్ణలత, నళిని, కవిత, మండల సమైక్య అధ్యక్షురాలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

తొర్రూరు, సెప్టెంబర్ 24: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని సీపీఎం తొర్రూరు పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య అన్నారు. సీపీఎం పట్టణ మహాసభలో కొమ్మనబోయిన యాకయ్యను పట్టణ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా బొల్లం అశోక్, మండల కార్యదర్శి యాకూబ్, పట్టణ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో యాకయ్య మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

కురవి(సీరోలు),సెప్టెంబర్ 24 : మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, ఇన్‌స్పైర్ సేవా వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చిప్పరపల్లి మల్సూర్ అన్నారు. మంగళవారం సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఇన్‌స్పైర్ సేవా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్సూర్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటి రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జెర్రిపోతుల మహేశ్‌గౌడ్, గడ్డం మధు, జాని, భూక్యా సైదులు, రమేశ్, చల్ల కుమార్, నెర్సు రవి, పామర్తి నవీన్ పాల్గొన్నారు.

చింతపల్లిలో మొక్కలు నాటుతున్న అసోసియేషన్ ప్రతినిధి మల్సూర్

వరద బాధితులకు అండగా..

బాధితులకు గ్యాస్ స్టౌ అందజేస్తున్న గంగరబోయిన రఘు

కురవి, సెప్టెంబర్ 24 : ఖమ్మం పట్టణం జలగంనగర్ ఇటీవల వరద బీభత్సానికి అతలాకుతలం కాగా, కురవి మండల కేంద్రానికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ యువకుడు గంగరబోయిన రఘు తన ఫాలోవర్స్ సహాయంతో తనకు తోచిన సాయం చేస్తున్నాడు. మంగళవారం జలగం నగర్‌లోని 4ఇండ్లకు సరిపడా ఇంటికో గ్యాస్ స్టౌ, ప్లేటు, గ్లాసు, లైటర్, గ్యాస్ పైపు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి వెంకన్న, చింతమల్ల యాకన్న, గూడూరు సంతోష్, బండారి కార్తీక్, కత్తి శరత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

గార్ల : అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్‌రావు కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని మంగపతిరావు భవనంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాల కేటాయింపులో రాజకీయాలకు జోక్యం లేకుండా చూడాలన్నారు. అక్టోబర్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల కమిటీ సభ్యులు కవిత హరినాయక్, ఈశ్వరలింగం, సత్యవతి, రామకృష్ణ, వీరస్వామి, ఎల్లయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీనివాస్

బొడ్డితండా వద్ద తెగిపోయిన రోడ్డుపై పోసిన మట్టి

దారి పోశారు..

'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

నర్సింహులపేట, సెప్టెంబర్ 24 : మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి దారి లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందిపడుతున్న విషయంపై 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 22న జిల్లా కేంద్రానికి దారేది? అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు నూతనంగా మోరీలు ఏర్పాటు చేసి ఎర్రమట్టి పోయించారు. బుధవారం నుంచి బస్సు నడిచే అవకాశం ఉంది.

ఎంఈవోల నియామకం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : జిల్లాలోని వివిధ మండలాలకు సీనియర్ గెజిటెడ్ హెడ్ మాస్టర్లను ఇన్‌చార్జి ఎంఈవోలుగా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (డీఎస్‌ఈ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బయ్యారం మండల ఎంఈవోగా దేవేంద్రాచారి, నెల్లికుదురు మండలానికి రామదాస్, కొత్తగూడకు లక్ష్మీనారాయణ, చిన్నగూడూరుకు రవికుమార్, దంతాలపల్లికి శ్రీదేవి, గంగారానికి వీరస్వామి, డోర్నకల్‌కు లక్ష్మా, గార్లకు వీరభద్రరావు, కురవికి బాలాజీ, మరిపెడకు అనితాదేవి, సీరోల్‌కు లచ్చిరామ్, నర్సింహులపేటకు రామ్మోహన్‌రావు, , పెద్దవంగరకు శ్రీనివాస్, తొర్రూరుకు బుచ్చయ్య, గూడూరుకు రవికుమార్, కేసముద్రానికి యాదగిరి, మానుకోటకు వెంకటేశ్వరరావు, ఇనుగుర్తికి జంగ రూపారాణిని నియమిస్తూ డీఎస్‌ఈ ఉత్తర్వులను జారీ చేసింది.

ఓటర్ నమోదును పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా నూతన ఓటరు నమోదుపై ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందన్నారు. ఇప్పటికే 90శాతానికి పైగా ఇంటి సర్వే పూర్తయిందని, ఈ నెల చివరి నాటికి 100 శాతం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో అలివేలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జీవో 25ని సవరించాలి

మరిపెడ, సెప్టెంబర్ 24 : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 25 ఉత్తర్వులను వెంటనే సవరించాలని మరిపెడ ఉపాధ్యాయ జేఏసీ నాయకులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో మున్సిపల్ కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రమేశ్‌రెడ్డి, హేమ్లా, లింగాల మహేశ్, జనార్దనాచారి, మంగు, హఫీజ్, కరుణాకర్, వెంకన్న, మంగీలాల్ పాల్గొన్నారు.

200 కోళ్లు మృత్యువాత

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : మండల శివారు మాధవాపురంలోని ఇస్లావత్ తండా(ఎం)లో లచ్చిరాం నాయక్‌కు చెందిన కోళ్లఫారంలో మంగళవారం అకస్మాత్తుగా 200 కోళ్లు చనిపోయాయి. అయితే దానాలో విష పదార్థం కలిసిందనే అనుమానంతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి, మృత్యువాతపై పంచనామా చేస్తామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు, సెప్టెంబర్ 24 : మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తండ్రి కేవ్లానాయక్ ఇటీవల అనారోగ్యంతో రాయపర్తి మండలం ఊకల్ గ్రామంలో మృతి చెందారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, ఎమ్మెల్యే మురళీనాయక్ శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేవ్లానాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

పెద్దవంగర, సెప్టెంబర్ 24 : గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఉప్పరగూడెంలో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఉప్పరగూడెం గ్రామానికి నీలం సోమయ్య(58) బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పది సంవత్సరాలపాటు సేవలందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు.

భూ తగాదాలో ఐదుగురికి రెండేళ్ల జైలు

మరిపెడ, సెప్టెంబర్ 24 : భూ తగాదా విషయంలో ఐదుగురికి రెండేళ్ల జైలు విధించారు. ఎస్సై సతీశ్‌గౌడ్ కథనం ప్రకారం.. 2015లో జర్పులతండాకు చెందిన జరుపు వెంకన్న అదే తండాకు చెందిన ఓ రైతు వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకున్నాడు. తన పెద్దనాన్న కౌలు చేయొద్దని చెప్పినా వినకుండా వెంకన్న సాగు చేస్తుండడంతో జర్పుల ప్రేమ్‌చంద్ పగ పెంచుకున్నాడు. నేతావత్ తండాలో వివాహ వేడుకకు వెళ్లిన వెంకన్నపై ప్రేమ్‌చంద్, రామారావు, లింగ్యా, శివ, రమేశ్ అనే ఐదుగురు వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. తలకు గాయాలు కాగా, వెంకన్న 2015లో మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఐదుగురికి రెండేళ్ల జైలు, ఒక్కొరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రతి ఒక్కరూ విద్యుత్ మీటర్ కలిగి ఉండాలి

దంతాలపల్లి, సెప్టెంబర్ 24 : విద్యుత్ వినియోగించే ప్రతి ఒక్కరూ మీటర్ కలిగి ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్సీ నరేశ్ తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విద్యుత్ మీటర్లు లేని ఇండ్లకు వెళ్లి మీటర్లను తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మీటర్లు లేని వారికి ఒక గొప్ప అవకాశం కల్పించిందన్నారు. రూ. 938కే నూతన విద్యుత్ మీటర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మీటర్లు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు డీఈ మధుసూదన్, ఏఈ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్, ట్రాలీ ఆటో ఢీ : ఇద్దరికి గాయాలు

తొర్రూరు, సెప్టెంబర్ 24 : ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటన మండలంలోని నాంచారిమడూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం పంథిని గ్రామానికి చెందిన కుక్కల చందు, సంతోష్ తొర్రూరు సంతలో గొర్రెలు కొనుగోలు చేసి తిరిగి ట్రాలీఆటలో పంథినికి వెళ్తుండగా నాంచారిమడూర్ గ్రామ శివారులో వరంగల్ నుంచి తొర్రూరుకు వస్తున్న తొర్రూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఢీ కొన్నది. ట్రాలీఆటో డ్రైవర్ చందు కాళ్లకు, సంతోష్ తలకు గాయాలు కావడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 24 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ వార్డెన్‌లను ఆదేశించారు. మంగళవారం రాత్రి ఆయన పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మెనూ చార్ట్, స్టాక్ రిజిస్టర్లు, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా వార్డెన్లు చూడాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధిలో అవినీతి నిర్మూలనకే తనిఖీలు

డీఆర్డీఏ ఏడీ శాంతకుమారి

పెద్దవంగర, సెప్టెంబర్24 : ఉపాధి హామీ పథకంలో అవినీతి నిర్మూలనకే సామాజిక తనిఖీ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ ఏడీ శాంతకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వడ్డెకొత్తపల్లి రైతు వేదికలో ఎంపీడీవో వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక వేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ కుమార్, రమేశ్, డీఆర్‌పీలు, ఏపీఎం, ఈసీ, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

నా డబ్బులు నాకు ఇప్పించాలని ఫ్లెక్సీతో నిరసన

కేసముద్రం, సెప్టెంబర్ 23: దళిత బంధు ఇప్పిస్తానని తీసుకున్న డబ్బులు ఇవ్వాలని కోరుతూ ఓ వ్యక్తి వినూత్న నిరసన తెలిపాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని పెద్దమోరి తండా శివారు కొత్తూరు గ్రామానికి చెందిన అనిల్ గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే డబ్బులు ఇస్తే దళిత బంధు ఇప్పిస్తానని మాజీ సర్పంచ్ తెలపడంతో గొర్రెలు అమ్మి రూ.70 వేలు ఇచ్చాడు. దీంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి 'మా గొర్రెలు మాకు ఇప్పించండి.. లేదంటే ఆత్మహత్యే శరణ్యం' అని రాసి నిరసన తెలిపాడు.

గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మాత, శిశు ఆరోగ్యం కోసం పోషకాహారం

నర్సింహులపేట, సెప్టెంబర్ 24 : మాత, శిశు సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం పోషకాహారం తీసుకోవాలని మరిపెడ ప్రాజెక్ట్ సీడీపీవో ఎల్లమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నర్సింహులపేట, దంతాలపల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ , నాగరాజు, సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.